క్లుప్తంగా

కౌమారిదేవికి ప్రత్యేక పూజలు



పూజలందుకుంటున్న అమ్మవారు

బొండపల్లి: వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా దేవుపల్లిలోని రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారు ఐదోరోజు బుధవారం కౌమారిదేవిగా దర్శనమిచ్చారు. అర్చకులు దూసి శ్రీధర్‌శర్మ అమ్మవారికి పూజలు, అర్చనలు చేశారు. ప్రత్యేక వంటకాలు చేసి నైవేద్యంగా సమర్పించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

విద్యార్థులకు వైద్యపరీక్షలు



విద్యార్థులకు ఆరోగ్య జాగ్రత్తలు సూచిస్తున్న వైద్య సిబ్బంది

దత్తిరాజేరు: స్థానిక మహాత్మా జ్యోతిబా పూలే గురుకుల బాలుర పాఠశాలలో విద్యార్థులకు కె.కొత్తవలస పీహెచ్‌సీ వైద్యాధికారి స్రవంతి బుధవారం వైద్య పరీక్షలు చేశారు. అనంతరం ఆరోగ్య సూత్రాలను వివరించారు. భోజనం చేసే ముందు సబ్బుతో చేతులను శుభ్రం చేసుకోవాలని, ఉతికిన దుస్తులను ధరించాలని, పరిశుభ్రత పాటించాలని సూచించారు. వైద్యసిబ్బంది, పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి ఆర్థిక సహకారం



ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేస్తున్న దాత జగదీష్

చీపురుపల్లి: స్థానిక కనకమహాలక్ష్మి అమ్మవారి దేవస్థానం సమీపంలో చేపడుతున్న అయ్యప్ప స్వామి ఆలయ నిర్మాణానికి పట్టణానికి చెందిన వేటూరి జగదీష్ కుటుంబ సభ్యులు రూ.3.33 లక్షలు ఆర్థిక సహాయం చేశారు. బుధవారం ఆయన తన నివాసం వద్ద ఆలయ ట్రస్టు బోర్డు సభ్యులకు నగదు అందజేశారు. ఈ సందర్భంగా ట్రస్టు బోర్డు సభ్యులు అప్పికొండ ఆదిబాబు, గంట్యాడ శీతరాజు, ఎస్వీజీ.శ్రీనివాసరావు, దాసరి రవిశంకర్, దిలీప్‌కుమార్ ధనూకా, గుడ్ల శ్రీను, నాగు, ఉమామహేశ్వరరావు మాట్లాడుతూ దాతల సహకారంతోనే ఆలయ నిర్మాణం చేపడుతున్నట్లు స్పష్టం చేశారు. ఇంకా దాతలు ముందుకొచ్చి సహకరించాలని కోరారు.

అనుమతి పత్రాలులేని వాహనాలపై కేసులు



వాహన తనిఖీలు చేస్తున్న ఎంవీ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు, డీఎం రమేష్ తదితరులు

శృంగవరపుకోట: అనుమతి పత్రాలు లేకుండా రోడ్లపై తిరుగుతున్న వాహనాలపై కేసులు నమోదు చేశామని ఎస్.కోట డిపో మేనేజర్ కె.రమేష్ చెప్పారు. మోటా ర్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ వెంకటరావు నేతృత్వంలో ఎస్.కోట డిపో మేనేజర్ రమేష్‌తో కలిసి, ధర్మవరం రూట్‌లో బుధవారం స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సుమారు 90 వాహనాలను తనిఖీ చేసి సరైన ధృవపత్రాలు లేని వేర్వేరు లోపాలతో ఉన్న, 4 వాహనాలపై కేసులు నమోదు చేసి, ఒక వాహనాన్ని సీజ్‌చేశారు. వేర్వేరు కేసు ల్లో రూ.21,000 పెనాల్టీ కట్టించారు. ఎస్.కోట ఆర్టీసీ డిపో సూపరింటెండెంట్ వెంకటరావు, ఏడీసీ రామకృష్ణ, ఆర్‌హెచ్‌సీ సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

గర్భిణులకు వైద్యపరీక్షలు



గర్భిణులకు భోజనాలు అందిస్తున్న సత్యసాయి భజన మండలి సభ్యులు

జామి: స్థానిక పీహెచ్‌సీలో గర్భిణులకు పీహెచ్‌సీ వైద్యాధికారి సామ్రాజ్యలక్ష్మి బుధవారం వైద్యపరీక్షలు చేశారు. ఉచితంగా మందులు అందజేసి, ఆరోగ్య జాగ్రత్తలు సూచించా రు.గర్భిణులకు సత్యసాయి భజనమండలి మాజీ కన్వీనర్ విన్నకోట సీతారామయ్య, వెంకటేశ్వర మెడికల్స్ యజమాని జి.మహేష్ భోజనాలు ఏర్పాటు చేశారు.

హామీలు అమలు చేయాలి

- అంగన్‌వాడీ, ఆశకార్యకర్తలు డిమాండ్

శృంగవరపుకోట: కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ కార్యకర్తలు డిమాండ్ చేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక ఐసీడీఎస్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు తమ్మినేని సూర్యనారాయణతో కలిసి అంగన్‌వాడీ కార్యకర్తలు సీడీపీఓకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా తమ్మినేని మాట్లాడుతూ గతంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సమ్మె చేసినప్పుడు టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నాయకులు తాము అధికారంలోకి వస్తే అంగన్‌వాడీల సమస్యలు పరిష్కరిస్తామని హామీ ఇచ్చారని గుర్తు చేశారు. కనీస వేతనాలు ఇస్తామని, ప్రభుత్వ ఉద్యోగు లుగా గుర్తిస్తామని, ఉద్యోగభద్రత కల్పిస్తామని, అంగన్‌వాడీ కార్యకర్తలకు ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కనీస వేతనం రూ.26,000, ప్రమాదబీమా, గ్రాట్యూటీ, పీఎఫ్, ఈఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, రిటైర్మెంట్ వయోపరిమితి పెంచాలని, ఐదేళ్లలోపు పిల్లలు ప్రైవేట్ స్కూళ్లకు వెళ్లకుండా జీఓ తేవాలని, లేబర్ కోడ్ రద్దు చేయాలని, కారుణ్య నియామకాలు అమలు చేయాలని, రిటైర్మెంట్ నాటికి ఉన్న వేతనంలో సగం పెన్షన్‌గా ఇవ్వాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ జిల్లా కార్య దర్శి మద్దిల రమణ, సీహెచ్.ముత్యాలు, అంగన్‌వాడీ యూనియన్ ప్రతినిధులు శ్యామల, కె.వి.లక్ష్మి, డి.జయలక్ష్మి, డి.దంతేశ్వరి, క్రాంతి తదితరులు పాల్గొన్నారు.



శృంగవరపుకోట: ఎస్.కోట ఐసీడీఎస్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు

వేధింపులు ఆపాలి..

చీపురుపల్లి: అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు ఎంతో కాలంగా ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారత కోర్కెల దినోత్సవాన్ని పురస్కరించుకుని సీఐటీయూ ఆధ్వర్యంలో స్థానిక ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. అనంతరం అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి టి.వి.రమణ మాట్లాడుతూ రాష్ట్రం లో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కొన్ని జిల్లాల్లో అంగన్‌వాడీ సిబ్బందితో కూటమి నాయకులు బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని ఆరోపించారు. మరికొన్ని అంగన్‌వాడీ కేంద్రాలకు తాళా లు వేస్తున్నారని, ఇలాంటి వేధింపులను అరిక ట్టాలని డిమాండ్ చేశారు. ఐసీడీఎస్ వ్యవస్థను బలోపేతం చేయాలని, అంగన్ వాడీలను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ అమలు చేయాలని కోరారు. అంతేకాకుండా కనీస వేతనం రూ.26 వేలు, పీఎఫ్, ఈఎస్‌ఐ అమలు చేయాలన్నారు. సీఐటీయూ డివిజన్ కార్యదర్శి అంబల్ల గౌరునాయుడు, అంగన్‌వాడీ సంఘ నాయకులు టి.మాలతి, కె.నాగమణి, డి.గౌరి తదితరులు పాల్గొన్నారు.



చీపురుపల్లిరూరల్(గరివిడి): తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న సీఐటీయూ, పెన్షనర్ల సంఘం నాయకులు



చీపురుపల్లి: ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయం వద్ద అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న సీఐటీయూ నాయకులు, అంగన్‌వాడీలు

ఆశ కార్యకర్తల సమస్యలను పరిష్కరించాలి

లక్కవరపుకోట: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వర్యంలో ఆశ కార్యకర్తలు డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. అఖిల భారత కోర్కెల దినోత్సవం సందర్భంగా ఆశ కార్యకర్తలు తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు.ఆశ కార్యకర్తల సంఘం మండల అధ్యక్షురాలు జి.దేవి మాట్లాడుతూ ఆశ,అంగన్‌వాడీ కార్యకర్తలు, మధ్యాహ్న భోజన పథకం నిర్వాహకులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు.సీఐటీయూ నాయకుడు తరిణి వెంకటరమణ మాట్లాడుతూ కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికులకు వ్యతిరేకంగా కార్పొరేటర్లకు అనుకూలంగా పనిచేస్తున్నాయని దుయ్యబ్టారు. లేబర్ కోడ్‌ను వెంటనే రద్దు చేయాలని, డ్రైవర్స్‌కు నష్టం చేసే భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని, ప్రభుత్వరంగ సంస్థల ప్రైవేటీకరణను వెంటనే ఆపాలని కోరారు.



లక్కవరపుకోట: డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఆశ కార్యకర్తలు

పెన్షనర్ల సమస్యలను పరిష్కరించండి

చీపురుపల్లిరూరల్(గరివిడి): పెన్షనర్ల సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పరిష్కరించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. అఖిల భారత కోర్కెల దినోత్స వం సందర్భంగా సీఐటీయూ,ఆల్ పెన్షనర్ల సంఘాల నాయకులు గరివిడి తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ధర్నా చేశారు. ఈసందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకుడు టి.వి.రామన్,జిల్లా ఉపాధ్యక్షుడు అంబల్ల గౌరినాయుడు మాట్లాడుతూ ఈపీఎఫ్ పెన్షనర్లకు నెలకు కనీసం రూ.9 వేలు పింఛన్, కరువు భత్యం ఇవ్వాలని, ఉచిత వైద్యం అందించాలని, అలాగే ప్రభుత్వరంగ సంస్థలను ప్రైవేటీకరణ ఆపాలని కోరారు. అనంతరం తహసీల్దార్ శ్రీనివాసరావుకు వినతిపత్రం అంజేశారు. సీఐటీయూ యూనియన్ అధ్యక్ష, కార్యద ర్శులు మూర్తి, సలీం, సన్యాసినాయుడు, పాపినాయుడు తదితరులు పాల్గొన్నారు.

సీసీఆర్సీలతో బహుళ ప్రయోజనాలు



కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేస్తున్న ఏఈఓ సంతోష్‌కుమార్ తదితరులు

బొండపల్లి: పంటసాగుదారు హక్కు ధ్రువీకరణ పత్రాల(సీసీఆర్సీ)తో అనేక ప్రయోజనాలు ఉన్నాయని, కౌలు రైతులంతా ఈకార్డుల కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏఈఓ సంతోష్‌కుమార్ సూచించారు. మండలంలోని కనిమెరక గ్రామంలోని రైతుసేవా కేంద్రంలో బుధవారం గ్రామసభ నిర్వహించి సీసీఆర్సీల(క్రాప్ కల్టివేటెడ్ రైట్స్ కార్డు) మంజూరుపై అవగాహన కల్పించారు. సీసీఆర్సీలు ఉన్న కౌలు రైతులకు భూయజమానుల మాదిరిగానే ప్రభుత్వం కల్పించే సౌకర్యాలు, రాయితీలు వర్తిస్తాయని చెప్పారు. అనంతరం ముగ్గురు కౌలు రైతులకు గుర్తింపు కార్డులు అందజేశారు. బోడసింగి గ్రామ సర్పంచ్ బోడసింగి జానకీరావు, వీఆర్‌ఓ రవి పాల్గొన్నారు.

స్టూడెంట్ కిట్ల పంపిణీ



విద్యార్థులకు స్టూడెంట్ కిట్లు అందజేస్తున్న వైస్ ఎంపీపీ ఈశ్వరరావు, తదితరులు

వేపాడ: మండలంలోని ఆకులసీతంపేట ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులకు వైస్ ఎంపీపీ అడపా ఈశ్వరరావు బుధవారం స్టూడెంట్ కిట్లను పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం కల్పిస్తున్న సదుపాయాలను సద్వినియోగించుకుని శ్రద్ధగా చదువుకోవాలని విద్యార్థులకు సూచించారు. గ్రామపెద్దలు, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఓబలయ్యపాలెంలో వైద్యశిబిరం



శిబిరంలో వైద్యసేవలందిస్తున్న డాక్టర్ శివాని

వేపాడ: మండలంలోని ఓబలయ్యపాలెంలో జ్వరాలు విజృంభిస్తున్న నేపథ్యంలో బొద్దాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వ ర్యంలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరం మూడోరోజు బుధవారం కొనసాగింది.వైద్యాధికారి శివాని ఆధ్వర్యంలో వైద్యసిబ్బంది 25 మందికి వైద్యసేవలందించారు. వీరిలో ఏడుగురు జ్వరాలతో బాధపడుతున్నట్లు గుర్తించి వారికి డెంగ్యూ, మలేరియా నిర్ధారణ టెస్టులు చేశారు. అలాగే దోమల నివారణకు గ్రామంలోని ఇళ్లలో మలాథియాన్ ద్రావణం పిచికారీ చేయించారు. హెచ్‌ఎస్ పి.ఎస్.ఆర్.మూర్తి, ఎంఎల్‌హెచ్‌పి, ఏఎన్‌ఎంలు, హెల్త్ అసిస్టెంట్లు పాల్గొన్నారు.

క్వారీల కార్యకలాపాలను అడ్డుకుంటున్నారని ఫిర్యాదు

వేపాడ: మండలంలోని వావిలపాడు,వీలుపర్తి పంచాయతీ పరిధిలో స్టోన్ క్రషర్లు, క్వారీ కార్యకలాపాలు, వ్యాపారాలను అడ్డుకుంటున్న వారిపై చర్యలు తీసుకోవాలని క్వారీ, క్రషర్ల యజమానులు విజయనగరం డీఎస్పీ గోవిందరావుకు ఫిర్యాదు చేశారు. పెదదుంగాడ రెవెన్యూ పరిధిలో ఐదుగురు రైతులకు చెందిన 5.32 ఎకరాల భూమిని 99 ఏళ్లకు రూ5.25 లక్షలు చెల్లించి 2009లో లీజుకు తీసుకున్నామని క్వారీ, క్రషర్ల యజమానులు తెలిపారు. నలుగురు వ్యక్తులు పట్టాదారుల వారసులమంటూ క్వారీ, క్రషర్ల కార్యకలాపాలకు నెల రోజుల నుంచి అడ్డు తగులు తు న్నారని, ఒక్కో క్రషర్, క్వారీ నుంచి రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. క్రషర్లు, క్వారీ వద్దకు వాహనాలు వెళ్లకుండా తాము లీజుకు తీసుకున్న భూముల్లో దారులను మూసేస్తున్నారని, దర్యాప్తు చేసి న్యాయం చేయాలని కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో క్వారీ, క్రషర్ల యజమానులు జి.వి.ఎస్.ప్రసాద్, ఎస్.రాజ్‌గోపాల్, కోటేశ్వరరావు, సతీష్‌రెడ్డి, శ్రీనివాసరావు ఉన్నారు.

పాడికి ఆధారం పచ్చిమేతే..



చీపురుపల్లి: పాడిరైతులకు రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేస్తున్న సహాయ సంచాలకులు శారద



లక్కవరపుకోట: రైతులకు పశుగ్రాసం విత్తనాలు అందజేస్తున్న సర్పంచ్ రామకృష్ణ, పశువైద్యాధికారి గాయత్రీదేవి

చీపురుపల్లి: పాడికి ఆధారం పచ్చిమేతనని ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు డాక్టర్ ఆర్.శారద చెప్పారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో పచ్చిగ్రాసం పెంపకంపై పాడి రైతులకు బుధవారం అవగాహన కల్పించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ పాడి పరిశ్రమ అభివృద్ధి లో పచ్చిమేత కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పాడిపశువుల పోషణ ఖర్చులో యాభైశాతం పచ్చిమేత కోసమే వెచ్చించాల్సి వస్తుందన్నారు. అందుకే రైతులు మొక్కజొన్న తో పాటు బహువార్షిక పశుగ్రాసాలు సాగు చేసుకోవాలని సూచించారు. పాల ఉత్పత్తికి అయ్యే ఖర్చును తగ్గించుకోవాలంటే పశుగ్రాసం తప్పనిసరిగా సాగు చేసుకోవాల న్నారు. అనంతరం రైతులకు 75 శాతం రాయితీపై ప్రశుగ్రాస విత్తనాలు పంపిణీ చేశారు.అన్ని రైతు సేవా కేంద్రాలు, ప్రాంతీయ పశువైద్య కేంద్రాల్లో గడ్డి విత్తనాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు.పశువైద్యాధికారి హైమ, ఫణీంద్ర, ఎల్.వాసుదేవరావు తదితరులు పాల్గొన్నారు.

పశుగ్రాసం పెంపకంపై అవగాహన

లక్కవరపుకోట: పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా పశుగ్రాసం పెంపకంపై కళ్లెంపూడి గ్రామంలో పాడి రైతులకు ఎల్.కోట పశువైద్యాధికారి గాయత్రీదేవి బుధవారం అవ గాహన కల్పించారు. కాయజాతి గడ్డి రకాలైన అలసంద, లూసర్న్, పిల్లిపెసర, వంటి పశుగ్రాసాన్ని పశువులకు మేతగా వేయడం వల్ల ద్వారా పాల దిగుబడి పెరుగు తుందన్నారు. చాఫ్ కట్టర్ ద్వారా పశుగ్రాసాన్ని ముక్కలు చేసి పశువులకు వేయడం ద్వారా పశుగ్రాసం వ్యర్థం కాకుండా నివారించవచ్చన్నారు. అనంతరం రైతులకు 75 శాతం రాయితీపై గడ్డి విత్తనాలు పంపిణీ చేశారు. సర్పంచ్ గుడిసె రామకృష్ణ పాల్గొన్నారు.

నాణ్యమైన బోధన కోసమే టీచ్ టూల్ శిక్షణ

చీపురుపల్లి: తరగతి గదుల్లో విద్యార్థులకు నాణ్యమైన, ఆకట్టుకునే విధంగా పాఠాలు బోధించేందుకు ఉపాధ్యాయులకు టీచ్ టూల్ శిక్షణ ఇస్తున్నామని ఎంఈఓ ఎం.బూసినాయుడు చెప్పారు. పట్టణంలోని ఓ ప్రైవేటు పాఠశాలలో ప్రభుత్వ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులకు తొమ్మిది రోజులుగా ఇస్తున్న టీచ్ టూల్ శిక్షణ బుధవారంతో ముగిసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాఠశాలల్లో తరగతి గదుల్లో బోధనా తీరును మార్చేందుకు, బోధన సామర్థ్యాలు పెంపొందించేందుకు టీచ్ టూల్ శిక్షణ దోహదపడుతుందన్నారు. 29 అంశాల్లో శిక్షణ ఇచ్చామని, వీటిని ఇక్కడ శిక్షణ పొందిన 89 మంది ప్రధానోపాధ్యాయులు ఆయా పాఠశాలల్లో ఉపాధ్యాయులకు వివరించాలని సూచించారు. గరివిడి ఎంఈఓ రామారావు, రిసోర్సు పర్సన్‌లు ఎస్.ఉమామహేశ్వరరావు, కె.రామకృష్ణ, డి.సత్యనారాయణ, శంకరరావు, శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంఈఓ బూసినాయుడు

కొత్త చట్టాలను రద్దు చేయాలి



కొత్తవలస: తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న ఆటో డ్రైవర్లు

కొత్తవలస: డ్రైవర్ల మెడకు ఉరితాడు లాంటి కొత్తగా చేసిన భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని రద్దు చేయాలని కోరుతూ సీఐటీయూ ఆధ్వ ర్యంలో ఆటో డ్రైవర్లు బుధవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేశారు. ఆటో డ్రైవర్లు కొత్తవలస జంక్షన్ నుంచి ర్యాలీగా తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి, తహసీల్దార్ చంద్రశేఖర్‌కు వినతిపత్రం అందజేశారు.సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ మాట్లాడుతూ దేశాన్ని బీజేపీ ప్రభుత్వం నాశనం చేసిందని, గత పదేళ్లలో అన్ని వర్గాల ప్రజల హక్కులను కాలరాస్తూ ఎన్నో చట్టాలు చేసిందని దుయ్యబట్టారు.అన్ని వ్యవస్థలను కార్పొరేట్ వ్యక్తులకు అప్పగించేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధమవుతోందని ఆరోపించారు. సీఐటీయూ నాయకులు గాడి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపసంహరించుకోవాలి

దత్తిరాజేరు: కార్మికుల హక్కులను హరించేలా తీసుకువచ్చిన కొత్త చట్టాలను కేంద్ర ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాల ని సీఐటీయూ జిల్లా కార్యదర్శి లక్ష్మి డిమాండ్ చేశారు. జాతీయ రహదారిపై కోమటిపల్లి వద్ద ఆటో కార్మికులు బుధవారం నిరసన తెలిపారు. ఈసందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ ఐపీఎస్ చట్టం ఉంటుండగా భారతీయ న్యాయ సంహిత చట్టాన్ని తెర పైకి తెచ్చి డ్రైవర్లకు జరిమానాలు,జైలు శిక్షలు కఠినంగా విధించడం సరికాదని అన్నారు. ప్రజాతిరుగుబాటు రాక ముందే ఇలాంటి చట్టాలను వెనక్కి తీసుకోవాలని కేంద్రప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ నాయకులు గౌరినాయుడు, శ్రీను, ఉమామహేశ్వరరా వు, తదితరులు పాల్గొన్నారు.



దత్తిరాజేరు: కోమటిపల్లిలో ఆందోళన చేస్తున్న సీఐటీయు నాయకులు, డ్రైవర్లు

మెగా జాబ్‌మేళాలో 300 మంది ఎంపిక

కొత్తవలస: స్థానిక వాగ్దేవి విద్యాసంస్థల్లో మ్యాజిక్ బస్ ఇండియా ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన మెగా జాబ్‌మేళా విజయవంతమైంది. ఈ జాబ్‌మేళాను సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.ఎస్.ఎస్.రాజు ప్రారంభించారు. వివిధ మల్టీనేషన్ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. జాబ్‌మేళాకు 500 మంది విద్యార్థులు హాజరు కాగా 300మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారు. సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ జి.ఎస్.ఎస్.రాజు మాట్లాడుతూ వాగ్దేవి కళాశాల యాజమాన్యం విద్యాబోధనతో పాటు ఉపాధి అవకాశాలు కల్పించడం గొప్ప విషయమన్నారు.జాబ్ మేళాకు ముందుగానే 10 రోజులు పాటు విద్యార్థులకు ప్రత్యేక శిక్షణ ఇచ్చి, విద్యార్థులు కార్పొరేట్ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపిక కావడానికి చేసిన కృషిని కొనియాడారు. శారద మెటల్స్, ఎల్లోయిస్ కర్మాగార హెచ్‌ఆర్ మేనేజర్ సన్యాసిరావు మాట్లాడుతూ విద్యార్థులు కమ్యూనికేషన్ స్కిల్స్‌ను పెంపొందించుకోవాలన్నారు. అనంతరం అతిథులంతా కలిసి కళాశాలలో కరస్పాండెంట్ కె.మహేశ్వరరావు ఏర్పాటు చేసిన ఐఏఎస్ అకాడమీని ప్రారంభించారు. కళాశాల డైరెక్టర్ సీహెచ్.ప్రవీణ్‌కుమార్, ప్రిన్సిపాల్ ఏ.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



జాబ్ మేళాలో ఎంపికైన వారికి ధ్రువపత్రాలు అందజేస్తున్న సెంచూరియన్ యూనివర్సిటీ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.ఎస్.ఎస్.రాజు

పాఠశాలల సందర్శన

జామి: మండలంలోని విజినిగిరి ప్రాథమిక, ఉన్నత పాఠశాలలను ఎంఈఓ-2 గంగరాజు బుధవారం సందర్శించారు. విద్యార్థుల హాజరు రికార్డులు, వారి వర్క్,నోట్ బుక్స్, ఉపాధ్యాయుల లెసెన్ ప్లాన్ పరిశీలించారు. విద్యార్థుల విద్యాసామర్థ్యాన్ని పరీక్షించారు. అకడమిక్ క్యాలెండర్ ప్రకారం సిలబస్ పూర్తి చేయాల ని ఉపాధ్యాయులకు సూచించారు. ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు.



ఉన్నతపాఠశాలలో విద్యార్థులతో కలిసి మధ్యాహ్న భోజనం చేస్తున్న ఎంఈఓ గంగరాజు

వ్యాధులు ప్రబలకుండా చర్యలు



మెరకముడిదాం: కొండలావేరులో ఫాగింగ్ చేస్తున్న సర్పంచ్ సత్యనారాయణ

మెరకముడిదాం: మండలంలోని కొండలావేరులో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా సర్పంచ్ కుమరాపు సత్యనారాయణ బుధవారం పారిశుద్ధ్యపనులు చేయించారు. దోమల నివారణకు గ్రామంలో అన్ని వీధుల్లో ఫాగింగ్ చేశారు. పంచాయతీ కార్యదర్శి, ఏఎన్‌ఎం, ఆశ కార్యకర్త పాల్గొన్నారు.

చింతలపేటలో..

గుర్ల: మండలంలోని చింతలపేటలో సర్పంచ్ పతివాడ భాస్కరరావు బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు వీధి కాలువల్లో పేరుకుపోయిన పూడిక, చెత్తను పారిశుద్ధ్య కార్మికులు తొలగించారు. వీధుల్లో బ్లీచింగ్ చల్లించారు. పనులను పంచాయతీ కార్యదర్శి శ్రీనివాసరావు పర్యవేక్షించారు.



గుర్ల: చింతలపేటలో పూడిక తీస్తున్న పారిశుద్ధ్య కార్మికులు



గజపతినగరం: మండల కేంద్రంలోని వీధుల్లో బ్లీచింగ్ జల్లుతున్న పారిశుద్ధ్య కార్మికులు

గజపతినగరంలో..

గజపతినగరం: మండల కేంద్రంలోని గజపతినగరం, పురిటిపెంట మేజర్ పంచాయతీల్లో సర్పంచ్‌లు, పంచాయతీ అధికారులు బుధవారం పారిశుద్ధ్య పనులు చేయించారు. వీధి కాలువల్లో పూడిక తీయించి, బ్లీచింగ్ చల్లించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



మానవహారంగా ఏర్పడిన అధికారులు, మహిళలు

వేపాడ: మండల కేంద్రం వేపాడతో పాటు జంట గ్రామం వల్లంపూడిలో ప్రకృతి వ్యవ సాయంపై జిల్లా ప్రకృతి వ్యవసాయ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం అవగాహన సదస్సులు, ర్యాలీలు నిర్వహించారు. స్థానిక వెలుగు కార్యాలయం వద్ద వెలుగు,మహిళా సమాఖ్య సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో ఆర్‌టీఎల్ ప్రకాష్, ఆర్‌టీఓ హేమసుందర్, డీఎల్ఎంపీ నాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించాల్సిన బాధ్యత మండల సమాఖ్య, ప్రకృతి వ్యవసాయ సిబ్బందిపై ఉందన్నారు. అనంతరం బీజామృతం,ఘనజీవామృతం, విత్తన బంతుల తయారీని ప్రయోగాత్మకంగా వివరించారు.ఎంటీఎల్ వసంత, ఎఫ్ఎఫ్ఏ శంకర్, ట్రైనర్ సన్యాసమ్మ, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్‌లు రాము, నారాయణమ్మ, ఈశ్వరమ్మ, రామలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.